చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

# వేములవాడ....



# గేమ్ ఛేంజర్



## ప్రగతికి పునాది....

## అనునిత్యం జనంలో ఉండే ఆది

ప్రత్యేక సంచిక

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

మన మాట
ప్రతి పదం ప్రజల పక్షం

# వేముల వాడ రేడు గేమ్ ఛేంజర్ అయినాడు చూడు




ప్రజాస్వామ్య వ్యవస్థను రాజ్యాంగబద్ధంగా నడిపించాల్సిన నాలుగు వ్యవస్థలు ప్రజల అజెండాతోనే పనిచేయాల్సి ఉంటుంది. ఈ నాలుగు వ్యవస్థ లూ కూడా ప్రజలతోనే మమేకం అవుతూ ఉండాలి. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ ఉంటాయి కూడా. శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ ప్రభుత్వంలో ఇంచుమించు భాగమై ఉంటాయి. వీటిపై ఓ కన్నేసి వాచ్ డాగ్ లా డ్యూటీ చేయాల్సిన బాధ్యత ఫోర్త్ ఎస్టేట్ ది. అంటే జర్నలిజానిది. నాలుగు వ్యవస్థల్లోనూ నిత్యం ప్రజలతో కలిసి మెలిసి తిరుగుతూ వారి జీవితాలను చాలా దగ్గరగా చూసేది ఇద్దరే. ఒకరు రాజకీయ వ్యవస్థలోని వారు. రెండు జర్నలిస్టులు. జర్నలిస్టులు సమాజంలోని అట్టడుగు వర్గాల కష్టాలూ కన్నీళ్లను తడిమి వారి సమస్యలను వెలుగులోకి తెస్తారు. అలా ఫోకస్ లోకి వచ్చిన సమస్యలను రాజకీయ వ్యవస్థలో ఉన్న వారు పరిష్కరిస్తూ ఉంటారు. ఎందుకంటే ఆ నిర్ణయం తీసుకునే అధికారం వారికే ఉంటుంది కాబట్టి. రాజకీయ నేతల్లో రెండు రకాలు.



ఎక్కువ మంది ఎన్నికల సమయంలో ప్రజలతో మమేకం అవుతూ వారికి తోచిన హామీలిస్తూ ఎన్నికల వరకు హడావిడి చేస్తారు. మరి కొంతమంది ఎన్నికలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి గోడు తెలుసుకుని ప్రభుత్వ పరంగా ఎలా పరిష్కరించాలో తాము చొరవ తీసుకుంటూ ఉంటారు. ఇటువంటి వారు అరుదుగా ఉంటారు. ఉన్న కొద్ది మందిలో జనం మనిషిగా ముద్రపడిన ముఖ్యనేత మా వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ కూడా ఉన్నారు. మా వేముల వాడ అని ఎందుకు అంటున్నానంటే నేనుకూడా అదే నియోజక వర్గానికి చెందిన వాడిని. నిజాయితీకీ,రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు వేములవాడ. ఆది శ్రీనివాస్ ను నా బాల్యం నుంచి గమనిస్తున్నాను. వయసులో ఆయన నాకంటే ఆరేళ్ళ పెద్ద. చదువు పూర్తి అయిన తర్వాత నేను వేముల వాడ వదిలి హైదరాబాద్ వచ్చేశాను. మూడున్నర దశాబ్ధాలకు పైగా జర్నలిజంలోనే కొనసాగుతున్నాను. నాకు భిన్నంగా ఆది శ్రీనివాస్ జన్మభూమిని వదలకుండా అక్కడే ఉంటూ అక్కడి ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ వస్తున్నారు. జర్నలిస్టుగా నేను చాలా మంది రాజకీయ నాయకులను గమనిస్తూ ఎదిగాను.

కానీ ఆది శ్రీనివాస్ లాంటి భోళా మనిషులను మాత్రం చాలా తక్కువగా చూశాను. ఆయనలో నాకు బాగా నచ్చిన గుణం ఏంటంటే పదవి ఉన్నా లేకపోయినా ఆయన జనంలోనే ఉండడం. ఎన్నికల్లో ఓటమి చెందితే మళ్లీ అయిదేళ్ల తర్వాత ఎన్నికలు వచ్చేవరకు చాలా మంది నేతలు ప్రజలకు కనిపించరు కానీ మా ఆదిశ్రీనివాస్ మాత్రం అలా కాదు. ఓటమి చెందిన మర్నాడు ఎందుకు ఓడామా అని ఒక్క రోజు ఆత్మపరిశీలన చేసుకుంటారు. అంతే ఆ రోజే మనసులోని బాధను వదిలేస్తారు. ఆ మర్నాటి నుంచి మళ్లీ మామూలే. జనంలోకి వెళ్లడం. రోజూ ఏదో ఒక గ్రామానికి వెళ్తారు. అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ ఉంటారు. 2009 ఎన్నికల్లో ఆయన పోటీ చేసినపుడు ఆయనకున్న జనాదరణ తెలిసిన వ్యక్తిగా ఆయన గెలుపు ఖాయం అనుకున్నాను. కానీ డబ్బు ముందు ఆయన నిలబడలేకపోయారు. అంత పోటీలోనూ కుబేరులను ఢీకొని కూడా కేవలం 18 వందల పై చిలుకు ఓట్ల స్వల్ప తేడాతోనే ఆయన ఓటమి చెందారు.



Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in



ఆ తర్వాత 2014 ఎన్నికల్లో బిజెపి నాయకత్వం పిలిచి టికెట్ ఇస్తే పోటీ చేశారు. అప్పుడు తెలంగాణా తెచ్చిన పార్టీగా భావోద్వేగాల సుడిలో బి.ఆర్.ఎస్. అభ్యర్థి చెన్నమనేని గెలిచారు. 2018 ఎన్నికల్లో ఇక చెప్పేదేముంది కేసీయార్ ప్రభంజనం వీయడంతో కాంగ్రెస్ లో చాలా మంది దిగ్గజ నేతలే ఓడిపోయారు. వరుసగా నాలుగు ఓటములు వెక్కిరించినా ఆది శ్రీనివాస్ ముఖంలో నవ్వు మాయం కాలేదు. ఆయన గ్రామాలు తిరగడం మానలేదు. 2009 నుండి 2023 వరకు 14 ఏళ్ల పాటు ఆయన నియోజక వర్గంలోని ప్రతీ గ్రామాన్ని ఇంచుమించు చుట్టి వచ్చారు. వేల సంఖ్యలో ప్రజలను పేరుతో పిలిచేంత పరిచయం పెంచుకున్నారు. జనంలో ఉండే నేతను ఓడించడం కరెక్ట్ కాదనుకున్నారో ఏమో కానీ 2023 ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ను గెలిపించి వేములవాడ ప్రజలు వివేకంతో వ్యవహరించారనిపించింది. రాజకీయ జీవితంలో ఆయన.. జర్నలిజం బాటలో నేను ఇంచుమించు సమాంతరంగా అడుగులు వేశాం.



ఇద్దరికీ కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఆయన నేనూ కూడా ఎప్పుడూ జనంలోనే ఉంటాం. ఇద్దరిదీ ఒకే నియోజక వర్గం. పేదల పక్షాన మనం పోరాడాలన్న ఆలోచనలోనూ ఇద్దరికీ పోలికలు ఉన్నాయి. కాకపోతే నేను జర్నలిస్ట్ గా కేవలం పేదల సమస్యలపై కథనాలు రాయగలను తప్ప వారి సమస్యలను నేనుగా పరిష్కరించలేను. అదే ఆది శ్రీనివాస్ అయితే పత్రికల్లో వచ్చిన ప్రజాసమస్యలనే కాదు తన పర్యటనల్లో తెలిసిన సమస్యలపైనా దృష్టి సారించి వాటిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. అటువంటి నిజాయితీ కలిగిన చిత్తశుద్ధి ఉన్న నాయకుడు మా నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా ఉండడం నాక్కూడా ఆనందమే. ఎందుకంటే వేములవాడలో అణగారిన వర్గాలు, వెనుకబడ్డ ప్రజలూ ఉన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపాలంటే ప్రజలకు మేలు చేసే నాయకుడు అధికారంలో ఉండాలి. ఎమ్మెల్యే సీటుపై ఉండాలి. నిజానికి 2023 వరకు ఆయన ఎమ్మెల్యే కాకపోయినా.. గెలిచిన ఎమ్మెల్యే కన్నా ఈయనే ఎక్కువ కార్యక్రమాలు చేపట్టారు. నియోజక వర్గానికి జూనియర్ కాలేజీ తెచ్చారు. శ్రీపాద ఎల్లంపల్లి సాగర్ ప్రాజెక్టును కదిలించారు. ఆ ప్రాజెక్టు ఇప్పటికైనా పూర్తిస్థాయిలో నిర్మాణం జరుపుకుంటుందని నియోజక వర్గ పౌరుడిగా కోరుతున్నాను. ప్రజలకు మంచి చేయాలంటే పదవే ఉండక్కర్లేదు. మంచి చేయాలన్న తలంపు ఉండాలి. అది ఆది శ్రీనివాస్ మది నిండా ఉంది. అందుకే నాకేమనిపిస్తుందంటే ఆయన మా వేములవాడకి గేమ్ ఛేంజర్. ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నియోజక వర్గ ప్రగతి ముందుకు సాగుతోంది. ఆయన మరింత కాలం మా నియోజక వర్గానికి సేవ చేస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను.



**అనిల్ కుమార్ కుంట....**

**సందేశ్ మీడియా...**

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది





కొందరంతే..ఉండడానికి తమకి ఇల్లు లేనట్లు జనం గుండెల్లో సెటిలైపోతారు.పదవి ఉందా లేదా అన్నది చూడరు. జనంలో ఉన్నామా లేదా అన్నదే ముఖ్యం వాళ్లకి.అయిదేళ్లకోసారి ఎన్నికల సమయంలో జనంతో ఉండేవాళ్లు చాలా మంది ఉంటారు.కానీ చాలా అరుదుగా నూటికో కోటికో కొందరుంటారు. వాళ్లు అనుక్షణం జనంతోనే ఉంటారు. జనంలోనే ఉంటారు.అటువంటి అరుదైన నాయకుడు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.రాజకీయాల్లో అడుగు పెట్టినప్పటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలకోసం పోరాటాలు చేస్తూ వచ్చారు.తానున్న పార్టీ అధికారంలో ఉంటే తాను ఎమ్మెల్యే కాకపోయినా నియోజక వర్గానికి ఎన్నో అభివృద్ధి ఫలాలు తెచ్చారు.నాలుగు సార్లు వరుసగా ఓడినా ప్రజలకు ఎప్పుడూ దూరం కాలేదు. ఓడిన ప్రతీ సారీ ప్రజలకు మరింత చేరువ అయ్యారు.ప్రజలకు తన అవసరం మరింత పెరిగిందను కునేవారు. అధికారం ఉన్నా లేకపో యినా ప్రజల తరపున నిలబడేవాడే నాయకుడని నమ్మారు. దానికే కట్టుబడి ఉన్నారు. ఆ సిద్ధాంతాన్నే దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో ఎన్నికల యుద్ధాల్లో ఆయన కోట్లకు పడగలెత్తిన పెద్ద నేతలతో తలపడ్డారు. వారి డబ్బులతో పోటీ పడలేక ఓటమి చెందారు.చివరకు ధన బలం కన్నా జన బలమే పవర్ ఫుల్ అని నిరూపిస్తూ వేములవాడ ఎమ్మెల్యేగా..ప్రభుత్వ విప్ గా ఎదిగారు. మొన్నటి గెలుపు వరకు కోటీశ్వరులతో పోరాటం. .సామాన్యులతో సావాసం అన్నట్లే ప్రస్థానం సాగించారు. ఇప్పటికీ అదే బాటన నడుస్తున్నారు. అందుకే వేములవాడకు సంబంధించి మాత్రం ఆయన్ను అందరూ గేమ్ ఛేంజర్ అని పిలుస్తున్నారు.

# జీవన ప్రస్థానమంతా ముళ్లబాటే

## విజయం వస్తే పొంగిపోలేదు..పరాజయం పలకరిస్తే కృంగిపోలేదు



విద్యార్థి దశ నుంచే ప్రశ్నించడం అలవాటయ్యింది. ఎక్కడన్నా అన్యాయం జరిగితే నిలదీయడమే. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజల తరపున నిలబడిపోవడమే. ఈ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు. మరెన్నో సమస్యలు. ఇబ్బందులు. ఎన్ని కష్టాలు ఎదురైనా జంకింది లేదు. వెనకడుగు వేసింది లేదు.జీవితమన్నాక ఎత్తు పల్లాలు  ఉంటాయి. కష్ట సుఖాలూ ఉంటాయి. వాటిని ధైర్యంగా అధిగమించడమే మనిషి చేయాల్సిన పని అని  బాల్యం లోనే ఒక క్లారిటీ వచ్చేసింది ఆది శ్రీనివాస్ కు. సమస్య వచ్చింది కదా అని అక్కడే ఆగిపోలేదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే నేర్చుకున్నారు. అలా వేసిన ఒక్కో అడుగు ఒక్కో పాఠాన్ని నేర్పాయి. అవి ఒక్కో మెట్టు ఎక్కించాయి.నడిచొచ్చిన దారంతా ముళ్ల బాటే. ఎక్కడా పూలబాట కాదు. కాకపోతే నడిచే కొద్దీ ఆ ముళ్లే పూలైపోయాయి. ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగారు. తన జీవితం ప్రజాసేవకోసమే అని నిర్ణయించుకున్నాక జనమే  ముఖ్యమని తేల్చుకున్నానంటారాయన. ఎవరైనా తప్పు చేస్తే.. ఎంత పెద్ద వారయినా సరే అది తప్పని నిర్మొహమాటంగా చెప్పేయడం అలవాటు. అది ఆరంభంలో కొద్ది మందిని ఇబ్బంది పెట్టి ఉండచ్చు కానీ..కాల క్రమంలో అది ఆది శ్రీనివాస్ లోని నిజాయితీ అని చుట్టు పక్కల వారు గమనించడం మొదలైంది. అది ఆయన తత్వమని అర్థమైంది. ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా వారి కష్టాలు అడిగి తెలుసుకునేవారు. వాటి పరిష్కారానికి తోచిన సాయం



చేసేవారు. తన కష్టాలను మాత్రం తనలోనే దాచుకునేవారు. అవి బయటకు వచ్చేవి కావు.

యవ్వనం నుంచి నేటి వరకు అదే జీవన శైలి.



పదో తరగతి వరకు రుద్రంగిలో చదివారు. ఇంటర్మీడియట్ మాత్రం కోరుట్లలో చదివారు. అయితే అక్కడ చదువుకునే సమయంలోనే ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఆందోళనలకోసం ఆది శ్రీనివాస్ చురుగ్గా పాల్గొనేవారు. దృష్టంతా ఉద్యమాలపై పెట్టడంతో చదువు ముందుకు సాగలేదు. అలా ఇంటర్మీడియట్ పూర్తి చేయలేదు. రెండేళ్ల గ్యాప్ తర్వాత ఐటీఐ లో చేరి ఎలక్ట్రానిక్స్ లో డిప్లమో పూర్తి చేశారు.కాలేజీలో చదివే రోజుల్లో రక రకాల పరిణామాలను నిశితంగా గమనిస్తూ పెరిగారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్న అంశంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్ల సిద్ధాంతాలు..



ఆలోచనల్లో నక్సలైట్ భావజాలం..

# లక్ష్య సాధనలో ప్రజాస్వామ్య మార్గం







ఆలోచనలతో ఆది శ్రీనివాస్ ఏకీభవించేవారు. కానీ వాటిని సాధించుకునే క్రమంలో నక్సలైట్ల హింసాయుత మార్గాన్ని ఆయన వ్యతిరేకించారు. ఆయుధంతోనే అనుకున్నది సాధించాలని నక్సలైట్లు అనుకునేవారు. వాటిని ప్రజాస్వామ్య బద్ధంగా సాధించుకోవాలన్నది ఆది శ్రీనివాస్ సిద్ధాంతం. సిద్ధాంతాలు ఒకటే అయినా.. దారులు వేరు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఆందోళనలు చేసేవారు. విప్లవాత్మక భావాలు.. ఆశయాలు ..ఆలోచనలు దండిగా ఉండేవి. కాకపోతే వాటిని రాజ్యాంగ బద్ధంగా చట్టబద్ధంగా ప్రజాస్వామ్య చట్రంలోనే సాధించుకోవాలన్నది ఆది శ్రీనివాస్ ఆలోచన. అయితే భిన్న భావజాలాలు..సిద్ధాంతాలు ఉన్న వారి గురించి ఏనాడూ విమర్శించలేదు. ఎవరి సిద్ధాంతాలు వారివి అని చాలా ఉదారంగా అంటారు ఆది.



## మొదటి ఎన్నికలోనే ఇండిపెండెంట్‌గా

# ఘన విజయం

### రాజకీయాల్లో అంచెలంచెలుగా ఒక్కో శిఖరాన్ని అధిరోహించిన వైనం



విద్యార్థి దశలోనే సమాజంపై అవగాహన పెంచుకున్నారు. చుట్టూరా ఉన్న సమాజంలో ఏం జరుగుతోందో తెలుసుకునేవారు. అదే సమయంలో ప్రపంచ పోకడలపైనా దృష్టి సారించేవారు. అన్ని అంశాలపైనా అనర్గళంగా మాట్లాడగలిగేవారు. ఇదే ఆయన్ను రాజకీయాలకు మరింత చేరువ చేసింది. 18 ఏళ్ల వయసులో ఐటీఐ చదువుతోన్నప్పుడు విద్యార్థి సంఘం ఎన్నికలు వచ్చాయి. అప్పట్లో పి.డి.ఎస్.యు, ఆర్.ఎస్.యు. వంటి వామపక్ష భావజాలం ఉన్న సంఘాలతో పాటు బిజెపి అనుబంధ విద్యార్థి సంఘం ఏ.బి.వి.పి. కూడా ఉంది. ఆ సమయంలోనే కొత్తగా టిడిపికి అనుబంధంగా తెలుగు విద్యార్థి సంఘం అవతరించింది. ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ను తెలుగు విద్యార్థి తరపున పోటీ చేయాల్సిందిగా టిడిపి మద్దతు దారులు కోరారు. పి.డి.ఎస్.యు. అభ్యర్థిగా పోటీచేయాలన్న ఆఫరూ వచ్చింది. అయితే ఆది శ్రీనివాస్ మాత్రం ఏ సంఘం తరపున పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. అలాగని ఎన్నికలకు దూరంగా ఉండకూడదని కూడా అనుకున్నారు. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఆది శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానంలో అదే తొలి అడుగు.



# ఒక్కో మెట్టు అధిరోహిస్తూ ఉన్నత శిఖరం వైపు పయనం

## గెలిచినా ఓడినా జనంలోనే ఉంటూ ప్రజలతోనే మమేకం

ముందుగా కాంగ్రెస్ పార్టీలో చేరారు ఆది శ్రీనివాస్. 1994 లో జెడ్పీటీసీ ఎన్నికల్లో మెంబర్ గా కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఘన విజయం సాధించారు. అయిదేళ్ల పాటు జనంలోనే ఉన్నారు. అప్పుడే ప్రజల జీవితాల గురించి వాళ్ల కష్టాలు కన్నీళ్ల గురించి అర్థం చేసుకోవడం మొదలైంది. 1997 లో పిసిసి సభ్యుడిగా నియమితులయ్యారు. 1997 నుండి 2000 సంవత్సరం వరకు కరీంనగర్ జిల్లా పరిషత్ లో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా వ్యవహరించారు. 2001 లో చందుర్తి మండల ప్రజాపరిషత్ ఛైర్మన్ గా విజయం సాధించారు. వై.ఎస్.ఆర్. ఆశీస్సులతో కాంగ్రెస్ లో చురుగ్గా వ్యవహరించారు. పార్టీ అధిష్ఠానం ఏ ఆదేశమిచ్చినా నిజాయితీగా ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ కు వేముల వాడ టికెట్ వచ్చింది. ప్రత్యర్థి ఏమో అపర కుబేరుడు. ఆది శ్రీనివాస్ ఏమో కుచేలుడు.



ప్రత్యర్థికి ధన బలం ఉంటే... ఆదికి పేద ప్రజల బలం ఉంది. అయితే డబ్బున్న వారితో పోటీ పడలేక ఆ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఆ తర్వాత నాలుగు నెలలకే ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. అకాల మరణం చెందారు. వై.ఎస్.ఆర్. మరణానంతరం ఉమ్మడి ఏపీలో మారిన రాజకీయ సమీకరణల్లో భాగంగా ఆది శ్రీనివాస్ వై.ఎస్.ఆర్. తనయుడు జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ లో చేరారు.





అయితే జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక తెలంగాణా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరుగుతోంటే సమైక్యాంధ్ర జెండా పట్టుకోవడంతో నిజమైన తెలంగాణా వాదిగా ఆది శ్రీనివాస్ వైసీపీకి రాజీనామా చేశారు. చాలా కాలం ఏ పార్టీలో చేరలేదు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆది శ్రీనివాస్ కు టికెట్ ఇవ్వకపోవడంతో పాటు బిజెపి నేతలు ఆదిని పిలిచి టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లోనూ ఓటమి చెందినా రెండో స్థానంలో నిలిచారు.ఆ తర్వాత 2018లో కేసీయార్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడం...ఆ ఎన్నికల్లో బి.ఆర్.ఎస్. ప్రభంజనం వీయడంతో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆది శ్రీనివాస్ మరోసారి ఓడిపోయారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండో రోజే తిరిగి ప్రజలతో మమేకం అవుతూ ముందుకు సాగారు. ఈ క్రమంలో 2023 ఎన్నికలు వచ్చాయి. రాజన్న సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న ఆది శ్రీనివాస్ మరోసారి వేముల వాడ బరిలో దిగారు. నాలుగు సార్లు ఆది శ్రీనివాస్ ఓటమి చెందినా తమకోసమే తమతోనే ముందుకు సాగడంతో నియోజక వర్గ ప్రజలు ఆది శ్రీనివాస్ ను దగ్గరుండి గెలిపించారు. వరుస ఓటములు వెక్కిరించినా చిరునవ్వు చెదరలేదు. ఎన్నికల్లో ఓడినా ఏనాడూ ప్రజలకు దూరం కాలేదు. అదే ఆది శ్రీనివాస్ ను వేములవాడ జననేతను చేసిందంటారు రాజకీయ విశ్లేషకులు





పేదలకోసం ఎందాకైనా వెళ్లే రకం. నిజం కోసం ఎంతటి పోరాటమైనా చేసే తత్వం.పంతం పడితే పట్టువదలని విక్రమార్కుని సైతం ఓడించే

# పంతం వస్తే ఎందాకైనా పోరాడే తత్వం

**న్యాయపోరాటంతో చెన్నమనేని రమేష్ పై అద్భుత విజయం**



నైపుణ్యం.వేములవాడ నియోజక వర్గంలో వరుసగా నాలుగు ఎన్నికల్లో ఓటమి చెందారు ఆది శ్రీనివాస్.ఆ నాలుగు సార్లూ వేముల వాడ నియోజక వర్గంలో విజయం సాధించింది చెన్నమనేని రమేషే. చివరి మూడు ఎన్నికల్లోనూ ఆది శ్రీనివాస్ నినాదం ఒక్కటే. జనంలో ఉండే నేను కావాలా? జర్మనీలో ఉండే రమేష్ కావాలా? మీరే తేల్చుకోండి అని ఎన్నికల ప్రచారంలో అనేవారు. అయినా ఏదో ఒకటి కలిసొచ్చి రమేష్ విజయాలు సాధిస్తూ వచ్చారు. నాలుగు సార్లూ రమేష్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆది శ్రీనివాస్ పదే పదే ఆరోపించారు.

ఆ తర్వాత  ఆది శ్రీనివాస్ అధ్యయనంలో తేలిందేంటంటే చెన్నమనేని రమేష్  వేముల వాడ ప్రజలనే కాదు  భారత దేశాన్నీ..ఇక్కడి వ్యవస్థలను సైతం మోసం చేశారని తేలిందంటారు. చెన్నమనేని రమేష్ కు జర్మనీ పౌరసత్వం ఉంది. భారత దేశంలో పౌరసత్వం లేకపోయినా..తప్పుడు పత్రాలతో ఆయన  ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారని ఆది శ్రీనివాస్ న్యాయపోరాటం చేశారు. 15 ఏళ్ల పాటు ఆది శ్రీనివాస్ పట్టువదలకుండా పోరాటం చేస్తూనే వచ్చారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కూడా చెన్నమనేనికి భారత పౌరసత్వం లేదని తేల్చింది. హైకోర్టు చెన్నమనేనిని తప్పుబట్టింది. అయితే అప్పటికీ చెన్నమనేని రమేష్ తనకున్న రాజకీయ పలుకుబడికి అదనంగా ఫేక్ డాక్యుమెంట్లతో  ఏళ్లకు ఏళ్లు నెట్టుకొచ్చేశారు. చివరకు న్యాయస్థానం చెన్నమనేనిని తప్పు బట్టడమే కాకుండా 30లక్షల రూపాయల జరిమానా కూడా విధించింది. నిజానికి నాలుగు సార్లు వేములవాడ నియోజక వర్గం నుంచి చెన్నమనేని  ఎన్నిక  కూడా రాజ్యాంగ విరుద్ధమైనదే.











చెన్నమనేని పై ఆది శ్రీనివాస్ న్యాయపోరాటం మొదలు పెట్టే సమయంలో చాలా మంది ఆదిని పిలిచి ఎందుకొచ్చింది పెద్దోళ్లతో గొడవ అన్నారు. అనవసరంగా నువ్వే ఇబ్బందులు పడాల్సి వస్తుందేమో చూసుకో అన్నారు. అయితే తాను చేస్తోన్నది న్యాయబద్ధమైన వాదన అని తాను నిజాన్నే నమ్ముకున్నానని భావించిన ఆది శ్రీనివాస్ ఎవ్వరు చెప్పినా పోరాటం ఆపలేదు. కోట్లకు పడగలెత్తిన చెన్నమనేని పై పోరాటం కొనసాగిస్తూనే వచ్చారు. చివరకు అద్భుత విజయం సాధించారు. ఇది తన జీవితంలోనే మర్చిపోలేని నైతిక విజయం అంటారు ఆది శ్రీనివాస్. ఆది శ్రీనివాస్ పోరాటం ఉధృతం అవ్వడం వల్లనే వేముల వాడ నియోజక వర్గంలో చెన్నమనేని మోసం గురించి ప్రజలకు తెలిసింది. దాంతో చెన్నమనేని గ్రాఫ్ పడిపోయింది. ఈ కారణంగానే బి.ఆర్.ఎస్. నాయకత్వం కూడా చెన్నమనేని రమేష్ కు టికెట్ ఇస్తే ఆది శ్రీనివాస్ చేతిలో ఘోర పరాజయం తప్పదని తమ సొంత సర్వేలు కూడా తేల్చి చెప్పడంతో చెన్నమనేనికి టికెట్ ఇవ్వకుండా చల్మెడ లక్ష్మీనరసింహారావుకు టికెట్ ఇచ్చింది. అయితే ప్రజల గుండెల్లో పాతుకు పోయిన ఆది శ్రీనివాస్ 2023 ఎన్నికల్లో అద్భుత విజయం సాధించారు. నాలుగు పరాజయాల తర్వాత అయిదో సారి గెలిచి సత్తా చాటారు. పట్టుబడితే విజయం సాధించే వరకు ఆది వదిలిపెట్టరనడానికి ఇదే తిరుగులేని నిదర్శనం.





ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది





## పాండవులు..శ్రీరాముడు..తరహాలోనే పధ్నాలుగేళ్లు

# జనం ఆశీస్సులతో అద్భుత విజయంతో మెరిసిన ఆది



రాజ్యాన్నేలాల్సిన పాండవులు పధ్నాలుగేళ్ళ వనవాసానికి వెళ్లాల్సి వచ్చింది.ఎన్ని కష్టాలు వచ్చినా ..విరాట రాజు కొలువులో ఉండి ధర్మానికి కట్టుబడి ప్రజలతో మమేకం అయ్యారు పాండవులు.అయోధ్యాపురికి పట్టాభిషిక్తుడు కావల్సిన శ్రీరామ చంద్రుడు తండ్రి ఇచ్చిన మాట నిలబెట్టేందుకు పధ్నాలుగేళ్ళ వనవాసం చేయాల్సి వచ్చింది. ఈ రెండు ఘటనల తరహాలోనే ఆది శ్రీనివాస్ కూడా మొదటి సారి 2009 అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఆ తర్వాత 2010 ఉప ఎన్నికల్లోనూ 2014లో రాష్ట్ర విభజన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ..ఆ తర్వాత తెలంగాణా రాష్ట్రంలో జరిగిన 2018 ఎన్నికల్లోనూ ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓడినా ఆది శ్రీనివాస్ జనంలోనే ఉంటూ వచ్చారు. ఓడిపోయాం కదా..మళ్లీ ఎన్నికల వరకు జనంలో ఉండాల్సిన అవసరం ఏముంది? గెలిచిన ఎమ్మెల్యే చూసుకుంటారని అనుకోలేదు.



ప్రజాక్షేత్రంలో తనను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయడం వారి తరఫున వారి సమస్యలపై గళం విప్పడం అవసరం అయితే పోరాటాలు చేయడం తన బాధ్యతగా ఆది శ్రీనివాస్ భావించారు. ఆయన నాలుగు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా.. నాలుగు సార్లూ స్వల్ప తేడాతోనే ఓడిపోయారు. నాలుగు సార్లూ రెండో స్థానంలోనే నిలిచారు. నాలుగు సార్లూ ఎన్నికల ఫలితాలు వచ్చిన మర్నాడు ఒక్కరోజు సెలవు తీసుకుని తర్వాతి రోజు నుంచి







జనంతోనే మమేకం అవుతూ వచ్చారు. ప్రతిపక్ష నేతగానే ఆయన వేముల వాడ నియోజక వర్గానికి ఎన్నో అభివృద్ధి పథకాలు సాధించుకున్నారు కూడా. అను నిత్యం తమతోనే ఉంటూ తమలో ఒకరిగా మసులుతూ తమ





సమస్యల కోసం పోరాడుతోన్న ఆది శ్రీనివాస్ ను ప్రజలు 2023 ఎన్నికల్లో అక్కున చేర్చుకున్నారు.








మా బిడ్డను మేం గెలిపించుకోవాలి అనుకున్న నియోజక వర్గంలోని  అన్ని వర్గాల ప్రజలూ ఆది శ్రీనివాస్ వెన్నంటే నిలిచారు. ప్రత్యేకించి బడుగు బలహీన వర్గాల ప్రజలయితే ఆదిని గెలిపించుకుని తీరాలన్న పట్టుదలతో ఓటేశారు. వారి ప్రేమాదరణల కారణంగానే తాను అసెంబ్లీలో అడుగు పెట్టగలిగానని..జీవితాంతం వారికి సేవలు చేస్తూ వారి రుణం తీర్చుకుంటానని ఆది శ్రీనివాస్ అంటున్నారు. 2009లో మొదటి సారి  అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగితే సరిగ్గా 14 సంవత్సరాల తర్వాత 2023లో ఆది శ్రీనివాస్ గెలిచి చట్టసభలో అడుగు పెట్టడం విశేషం. ప్రతిపక్ష నేతగా తాను ఏ ప్రజాసమస్యలకోసం పోరాటాలు చేశానో ఇపుడు అధికారంలో ఉన్న  నాయకుడిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ వినయంగా అన్నారు. తానెప్పుడూ గరీబోళ్ల బిడ్డనే అన్నారాయన. దేశాన్నేలే చక్రవర్తి హోదా కన్నా పేదల బిడ్డనన్న పేరే తనకు తిరుగులేని ఆనందాన్నిస్తుందని..అదే తనకు పెద్ద బిరుదుగా భావిస్తానని అంటారు ఆది శ్రీనివాస్.

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది



కొన్ని పరిచయాలు జీవితకాలపు అనుబంధాలుగా మారిపోతాయి.ఆది శ్రీనివాస్ జీవితంలో అటువంటి అనుబంధాలు చాలానే ఉన్నాయి.కాకపోతే అన్నింటిలోకీ ఆయనకు మనసులో ప్రత్యేక ముద్ర వేసిన అనుబంధం మాత్రం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్.తో బంధమే. 1991 లోక్ సభ ఎన్నికల సమయం. అప్పటికి ఆది శ్రీనివాస్ కు పాతికేళ్ల వయసు. ఆ ఎన్నికల్లో కడప లోక్ సభ నియోజక వర్గం నుంచి వై.ఎస్.రాజశేఖర రెడ్డి రెండో సారి విజయం సాధించారు. ముక్కుసూటిగా పోయే వై.ఎస్.ఆర్.



# ఉత్తర ప్రత్యుత్తరాలతో
# వైఎస్ఆర్‌తో సాన్నిహిత్యం

## దివంగత సిఎంతో విడదీయరాని స్నేహానుబంధం



వ్యవహారశైలి..మాట ఇస్తే దానికి కట్టుబడే నైజం..తనని నమ్ముకున్న అనుచరులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండా నిలిచే నాయకత్వ లక్షణం ఉన్న వై.ఎస్.ఆర్. అంటే ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక అభిమానం ఉండేది. 1991 ఎన్నికల్లో వై.ఎస్.ఆర్. విజయం సాధించగానే ఆయన్ను అభినందిస్తూ లేఖ రాసిన ఆది శ్రీనివాస్..మిమ్మల్ని ఒకసారి కలవాలని ఉందని అందులో పేర్కొన్నారు. 15రోజుల్లోనే వై.ఎస్.ఆర్. నుంచి ఆది శ్రీనివాస్ కు ప్రత్యుత్తరం వచ్చింది. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు నన్ను కలవచ్చు అని ఆ లేఖలో పేర్కొన్నారు.

S tv SANDESH
www.Sandeshtv.in




వై.ఎస్.ఆర్. ను కలుద్దామని ఆయన నివాసానికి వెళ్తే ఆయన లేరని తెలిసి వెనక్కి వెళ్లిపోవలసి వచ్చింది. రెండు సార్లు అలా జరిగిన తర్వాత మరో లెటర్ రాశారు ఆది. మీ ఇంటికి వచ్చా మీరు లేరు అని అందులో వివరించారు. దానికి కూడా వై.ఎస్.ఆర్. రిప్లై ఇచ్చారు. ఈ సారి ఆ లేఖలో తన ఫోను నంబర్ ఇచ్చి ఈ సారి వచ్చేటపుడు ఫోన్ చేసి తాను ఉన్నానో లేదో చెక్ చేసుకుని రండన్నారు. 1991 నవంబరలో మొదటి సారి వై.ఎస్.ఆర్. ని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు ఆది శ్రీనివాస్. అదే దిగ్గజ నేతతో తొలి పరిచయం. ఇక అక్కడి నుండి నెలకో సారో రెండు సార్లో వై.ఎస్.ఆర్. ను కలుస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆది శ్రీనివాస్ కరీంనగర్ జిల్లాలో జిల్లా పరిషత్ మెంబర్ గా ఎన్నికల్లో విజయం సాధించారు. ఆది శ్రీనివాస్ లో నాయకత్వ లక్షణాలున్నాయని అప్పుడే వై.ఎస్.ఆర్. గుర్తించారు. ఇక అప్పటి నుండి ఆది శ్రీనివాస్ తో వై.ఎస్.ఆర్. కూడా మరింత సన్నిహితంగా ఉంటూ వచ్చారు. 1999 ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ అసెంబ్లీ నుంచి పోటీచేస్తే బాగుంటుందని ఆయన అనుచరులు ఆశించారు. వై.ఎస్.ఆర్. కూడా సానుకూలమే. కాకపోతే అప్పటికే పార్టీలో ఉన్న సీనియర్ ను కాదనే పరిస్థితి లేదు. దాంతో వై.ఎస్.ఆర్. పెట్టిన అభ్యర్థి విజయం కోసం ఆది శ్రీనివాస్ మనస్ఫూర్తిగా కష్టపడ్డారు.





అయిదేళ్ల తర్వాత 2004 ఎన్నికలు వచ్చాయి. ఈ సారి అయినా ఆది పోటీ చేస్తే బాగుంటుందని మిత్రులు ఆశించారు. అయితే ఆ ఎన్నికల్లో పొత్తుల కారణంగా ఆది శ్రీనివాస్ కు టికెట్ ఇవ్వడం కుదరలేదు. అయినా ఆది శ్రీనివాస్ నిరుత్సాహ పడలేదు. వై.ఎస్.ఆర్. ఆదేశాల మేరకు..కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం మేరకు పార్టీ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేశారు. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత వై.ఎస్.ఆర్. ముఖ్యమంత్రి అయ్యారు. సిఎం అయిన తర్వాద ఆది శ్రీనివాస్



తో మరింత సన్నిహితంగా ఉన్నారు వై.ఎస్.ఆర్. నిజాయితీగా కష్టపడి పనిచేసే ఆది శ్రీనివాస్ కు వేముల వాడ రాజ రాజేశ్వర స్వామి దేవాలయానికి ఛైర్మన్ గా నియమించారు వై.ఎస్.ఆర్. వరుసగా రెండు సార్లు ఆ పదవిలో కొనసాగిన ఆది శ్రీనివాస్ ఆలయ అభివృద్ధికి అద్భుతంగా పనిచేశారు. ఇది వై.ఎస్.ఆర్. కు బాగా నచ్చింది. అందుకే 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ను పిలిచి వేములవాడ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి టికెట్ ఇచ్చారు వై.ఎస్.ఆర్. ఆ ఎన్నికల్లో కేవలం 1821 ఓట్ల తేడాతో ఆది ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓటమి చెందినా నియోజక వర్గ అభివృద్ధికి వై.ఎస్.ఆర్. ను అడిగి ఎన్నో నిధులు సాధించుకుని వచ్చారు. వై.స్.ఆర్. అకాల మరణంతో ఆది శ్రీనివాస్ చేపట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నాంపల్లి వద్ద ఆగిపోయింది. ఆ తర్వాతి పాలకులు దాన్ని పట్టించుకోలేదు. ఇపుడు ఆది శ్రీనివాసే ఎమ్మెల్యే కాబట్టి దాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు. వై.ఎస్.ఆర్. మరణం రాష్ట్రానికి తీరని లోటని..తనకు వ్యక్తిగతంగా పూడ్చలేని విషాదమని అంటారు ఆదిశ్రీనివాస్.


S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

# ఆ రెండు ఘటనలు ఇప్పటికీ

# గుండెను కలిచి వేస్తాయి

## అవి గుర్తుకు వస్తే చాలు కళ్లు రెండూ చెమరుస్తాయి

కొన్ని జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడతాయి. అనుక్షణం వేధిస్తాయి. గుండెల్లో విషాదం గూడు కట్టుకుపోతుంది. గొంతులో ఆక్రోశం అడ్డుపడు తుంది. అటువంటి మర్చిపోలేని చేదు జ్ఞాపకాలు ఆది శ్రీనివాస్ జీవితంలో రెండున్నాయి.రాజకీయ రంగంలో తనకు అత్యంత ఆత్మీయుడు..గురువు అయిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి 2009లో అనుకోని విషాద ఘటనలో అకాల మరణం చెందడాన్ని ఆది శ్రీనివాస్ జీర్ణించుకోలేకోపాయరు. వై.ఎస్.ఆర్. మరణం వ్యక్తిగతంగా తనతో పాటు రాష్ట్రానికీ తీరని లోటే అన్నారాయన. వై.ఎస్.ఆర్. జీవించి ఉంటే అభివృద్ధి మరో స్థాయిలో ఉండేదంటారాయన. వై.ఎస్.ఆర్. మరణం కారణంగానే వేముల వాడ నియోజక వర్గంలో తాను తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగానూ వై.ఎస్.ఆర్. లేకపోవడంతో..ఆయన లేని రాజకీయాలను ఊహించుకోడానికి ఇబ్బందిగా ఉండేదంటారు ఆది శ్రీనివాస్. అయితే అంతిమంగా వై.ఎస్.ఆర్. ఆశయాల సాధనకోసం ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకుని ముందుకు సాగానంటారు.





# ఆది శ్రీనివాస్ ను టార్గెట్ చేసి..

# బాబాయ్ జంగయ్యను హతమార్చారు

ఆది శ్రీనివాస్ జీవితంలో అత్యంత విషాదకరమైన రెండో ఘటన ఆయన బాబయ్య సర్పంచ్ గంగ జంగయ్య దారుణ హత్య. అదెలా జరిగిందంటే.. ఆది శ్రీనివాస్ రాజకీయాలకోసం కావచ్చు..వ్యాపారాల కోసం కావచ్చు ఎక్కడికైనా వెళ్లినా.. సంక్రాంతి పండగ సమయంలో మాత్రం స్వగ్రామం రుద్రంగికి రావల్సిందే. పండగ మూడు రోజులు బంధుమిత్రులతో..ముఖ్యఅనుచరులతో గ్రామ ప్రజలతో కలిసి హల్ చల్ చేసేవారు. 2004లో వై.ఎస్.ఆర్. ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్లతో ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే కొన్ని కారణాల వల్ల అవి పూర్తిగా సఫలం కాలేదు. ఆ కోపంతో నక్సలైట్లు పాలకపక్షమైన కాంగ్రెస్ ను టార్గెట్ చేసుకున్నారు. అధికార పార్టీ నాయకుడిగా ఆది శ్రీనివాస్ నూ హిట్ లిస్ట్ లో పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన సంక్రాంతి



పండగకు ఆది శ్రీనివాస్ రుద్రంగి గ్రామం వెళ్లాల్సి ఉండింది కానీ..చివరి నిముషంలో అది క్యాన్సిల్ అయ్యింది. ఈ విషయం తెలియని నక్సలైట్లు రుద్రంగి గ్రామంలో ఆది శ్రీనివాస్ ఇంటిని చుట్టుముట్టారు. అయితే ఆయన లేడన్న సమాచారం తెలియడంతో ఆ కోపం కాస్తా ఆది శ్రీనివాస్ బాబాయ్ అయిన గ్రామ సర్పంచ్ గంగ జంగయ్యపై మళ్లింది. ఏదో ఒక సంచలన ఘటనతో వార్తల్లోకి ఎక్కాలన్న లక్ష్యంతో నక్సలైట్లు గంగ జంగయ్యను హతమార్చి వెళ్లిపోయారు. తాను ఆ పండగ వేళ రుద్రంగి వెళ్లి ఉంటే నక్సలైట్లు తనను టార్గెట్ చేసేవారని తన బాబాయ్ క్షేమంగా ఉండేవారని ఆది శ్రీనివాస్ కంటతడి పెట్టుకుంటారు ఇప్పటికీ. ఈ రెండు ఘటనలూ జరక్కపోతే చాలా బాగుండేదంటారాయన.



ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉంటారు. మిత్రులూ ఉంటారు. అంతే కానీ శత్రువులు ఉండరంటారు అజాత శత్రువుగా పేరు గడించిన ఆదిశ్రీనివాస్. రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలకు సేవ చేయాలనుకుంటే పదవుల్లోనే ఉండాల్సిన అవసరం లేదంటారు ఆది శ్రీనివాస్. ప్రజలకు, నియోజక వర్గానికి ఏదో ఒకటి చేయాలన్న చిత్తశుద్ధి పట్టుదల ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చంటారు ఆది.వేముల వాడలో ఆయన దాన్నే చేసి చూపించారు కూడా. వేముల వాడ నియోజక వర్గంలో ఉన్నవారికే కాదు.. కరీంనగర్ జిల్లా వాసులందరికీ వేముల వాడ రాజన్న అంటే ఎనలేని భక్తి ప్రపత్తులు ఉంటాయి. ఆ మాటకొస్తే



## రాజకీయ ప్రత్యర్థే సెహభాష్ అనడాన్ని మించిన

# ఆనందం ఏముంటుంది?

తెలంగాణా ప్రజలందరికీనూ. అటువంటి రాజరాజేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి తాగునీటి సమస్య లేకుండా చేయాలంటే శ్రీపాద సాగర్ నుండి వేముల వాడకు నీటిని తరలించాలి. ఇది ఈ నియోజక వర్గానికి చెందిన రాజకీయ కురువృద్ధుడు కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చెన్నమనేని రాజేశ్వరరావు జీవితకాలపు కల కూడా. దీన్ని సాధించాలని ఆయన చాలా ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.





ఇదే నియోజక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ 2004 ఎన్నికల్లో కనీసం పోటీ చేయలేదు. 2006 ప్రాంతంలో ఆది శ్రీనివాస్ చందుర్తి



మండల పరిషత్ అధ్యక్షుడిగా ఉన్నారు. అదే సమయంలో వేములవాడ దేవస్థానం ఛైర్మన్ గానూ ఉన్నారు. సరిగ్గా ఈ తరుణంలోనే ఆది శ్రీనివాస్ పంతం బట్టి ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. ను తమ మండలానికి తీసుకు వచ్చారు. వేలాది మంది ప్రజలు తరలి వచ్చిన సభా వేదిక సాక్షిగా వేముల వాడ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేసే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు హామీ ఇవ్వాలని వై.ఎస్.ఆర్. ను కోరారు. ఆ వేదికమీంచే ముఖ్యమంత్రి హోదాలో వై.ఎస్.ఆర్. లక్ష ఎకరాలకు సాగు నీరందించే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించి తీరతామని ప్రకటించడమే కాదు దానికి 1780 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తున్నట్లు కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు.



నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెన్నమనేని రాజేశ్వరరావు తనయుడు చెన్నమనేని రమేష్ ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు.ఆయన మూడు నెలలు వేములవాడలో ఉంటే తర్వాతి మూడు నెలలు జర్మనీలో ఉండేవారని అందుకే నియోజక వర్గాన్ని కానీ ఈ ప్రాజెక్టును కానీ పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇపుడు మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం..ఆదిశ్రీనివాస్ వేములవాడకు ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్ గా ఉండడంతో ఈప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం అయ్యింది.

నిజానికి 2003లో వై.ఎస్.ఆర్. పాదయాత్ర చేస్తున్న సమయంలోనే ఈ హామీ ఇచ్చారు. దాన్నే ఆది శ్రీనివాస్ కోరిక మేరకు ముఖ్యమంత్రి హోదాలో వై.ఎస్.ఆర్. సాకారం చేశారు. ఈ సభావేదికపై నాటి స్థానిక ఎమ్మెల్యే హోదాలో అక్కడ ఉన్న చెన్నమనేని రాజేశ్వరరావు ఆనందంతో తానూ చప్పట్లు కొట్టి ' నాకంటే చిన్నవాడైనా.. ఆది శ్రీనివాస్ మన నియోజక వర్గానికి అద్భుత అభివృద్ధి పథకాన్ని తెచ్చిపెట్టాడు. సాక్షాత్తూ ముఖ్యమంత్రిని పట్టుబట్టి తీసుకు వచ్చి ప్రకటన చేయించాడని మనస్ఫూర్తిగా మెచ్చుకున్నారు.రాజకీయ ప్రత్యర్థి అయిన రాజేశ్వరరావు చేసిన ప్రశంస చాలా గొప్పది. 2009లో వై.ఎస్.ఆర్. అకాల మరణంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నాంపల్లి దగ్గర ఆగిపోయింది.

వై.ఎస్.ఆర్.చేత నిధులు మంజూరు చేయించిన ప్రాజెక్టును పూర్తి చేయించడం ఆ తర్వాత వచ్చిన బి.ఆర్.ఎస్. ప్రభుత్వం వల్ల కాలేదు. విచిత్రం ఏంటంటే 2009 నుండి వరుసగా





# మది నిండా రాజ రాజేశ్వర స్వామి దివ్య స్వరూపమే





## దక్షిణ కాశి అభివృద్ధి కోసం విప్లవాత్మక సంస్కరణలు

బాల్యం నుంచే వేములవాడ రాజ రాజేశ్వర స్వామి అంటే అచంచలమైన భక్తి ఉండేది. ఆది శ్రీనివాస్ ఎదుగుతున్న కొద్దీ రాజన్నపై భక్తి భావం కూడా పెరుగుతూనే వచ్చింది. దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడకు వచ్చే భక్తులు సంతోషంగా తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేలా వేములవాడను అభివృద్ధి చేయాలని ఆది శ్రీనివాస్ భావించేవారు. రాజన్న సేవ చేసుకునే భాగ్యం దొరకడమే అదృష్టం అనుకునేవారు. దైవ నిర్ణయమో..ఆది శ్రీనివాస్ అదృష్టమో తెలీదు కానీ.. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే కావడానికి చాలా ఏళ్ల ముందుగానే వేములవాడ రాజన్న దేవస్థానం ఛైర్మన్ అయ్యారు.

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది



ఈ సమయంలో దేవస్థానం అభివృద్ధికోసం..భక్తులకు మౌలిక సదుపాయలు, వసతుల కల్పనకోసం ఆది శ్రీనివాస్ ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఓ సారి ఆది శ్రీనివాస్ షిర్డీ వెళ్లి సాయిబాబా దేవాలయాన్ని పరిశీలించారు. అక్కడ భక్తులకోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ సిస్టమ్ అద్భుతం అనిపించింది. అంతే వేములవాడ రాగానే రాజన్న దేవస్థానంలో మొదటి సారిగా క్యూలైన్ వ్యవస్థను ఏర్పాటు చేయించారు. దేవాలయ ఆదాయాన్ని పెంచేందుకు రక రకాల ఆలోచనలు చేశారు. దేవస్థానంలో వచ్చే కొబ్బరికాయలు, తల నీలాల వేలంలో మార్పులు చేసి ఆదాయం పెంచారు. ఆది శ్రీనివాస్ దేవస్థానం ఛైర్మన్ అయ్యే సరికి వీటి ద్వారా నెలకు 40లక్షల ఆదాయం వచ్చేది. దాన్ని రెండు కోట్ల స్థాయికి పెంచగలగడం రాజన్న కరుణాకటాక్షాల వల్లనే సాధ్యమైందంటారు ఆది శ్రీనివాస్.





వేముల వాడ దేవస్థానం ఛైర్మన్ గా వ్యవహరించిన వారు రాజకీయంగా ఎదగలేరన్న ఒక  నమ్మకం స్థానికంగా బలంగా ఉంది. దీన్ని ఆది శ్రీనివాస్ దగ్గర ప్రస్తావిస్తే అదంతా ట్రాష్ అన్నారు.వేముల వాడ దేవస్థానం ధర్మకర్తగా పనిచేసిన పి.వి.నరసింహారావు  కాల క్రమంలో దేశానికి ప్రధాని కాలేదా? అని ఆది ప్రశ్నించారు. ఆయన అన్నట్లుగానే ఆది శ్రీనివాస్ కూడా కాల క్రమంలో వేములవాడ ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా ప్రభుత్వ విప్ పదవిని కూడా అందుకున్నారు. మన వైఫల్యాలను దేవుడికి ఆపాదించడం కరెక్ట్ కాదంటారు ఆదిశ్రీనివాస్. రాజన్నకు సేవ చేసుకోగలగడం పూర్వజన్మ సుకృతమే అంటారాయన. గత ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయిన తర్వాత వేములవాడ ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత  పలుకార్యక్రమాలకు శ్రీకారం చుట్టించారు.







# ఎనిమిదిన్నర అయ్యిందంటే
# ఏదో ఒక గ్రామంలో సందర్శించడమే

2009 అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగింది లగాయితు..ఇప్పటి వరకు ఆది శ్రీనివాస్ దినచర్యలో ఎలాంటి మార్పు రాలేదు. ఇపుడంటే ఎమ్మెల్యేగా.. ప్రభుత్వ విప్ గా హైదరాబాద్ లో ఉండాల్సి వస్తే ఏమో కానీ..ఆయన వేములవాడ నియోజక వర్గంలో ఉంటే మాత్రం పొద్దున్న ఎనిమిదిన్నర అయ్యిందంటే నియోజక వర్గంలో ఏదో ఒక గ్రామానికి వెళ్తారు. అక్కడి ప్రజల కష్ట సుఖాలను నేరుగా ఆరా తీస్తారు. సమస్యలేంటో తెలుసుకుంటారు. వాటి పరిష్కారాల కోసం అధికారుల వెంటపడతారు. 2023లో అయితే ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు కానీ..2009 నుండి ఆయన ఎన్నికల్లో ఓడిపోయినా.. ఇలాగే గ్రామాలు పర్యటిస్తూ జనంతో మమేకం అవుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారుల వెంటబడి పనులు చేయిస్తూనే ఉండేవారు. తనకు ముందు వేములవాడకు ఎమ్మెల్యేగా చేసిన వారు వారి పదవుల పరిరక్షణకోసమే చూసుకునేవారు తప్ప ప్రజల గోడు పట్టించుకునే వారు కాదంటారు ఆది శ్రీనివాస్. ప్రత్యేకించి చెన్నమనేని రమేష్ అయితే





మూడు నెలలు వేములవాడలో మూడు నెలలు జర్మనీలో ఉంటూ ప్రజలను గాలికి వదిలేశారని ఆది మండిపడతారు.

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in







'చట్ట సభలో అడుగు పెట్టడం అంటే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండడం. అంటే ప్రజల బాధ్యతను భుజాలకెత్తుకోవడం. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధికి నడుం బిగించడం. అన్నది ఆది శ్రీనివాస్ ఫిలాసఫీ. అందుకే 2023లో తనను గెలిపించిన ప్రజలు తనపై అదనపు బాధ్యతలు పెట్టారని ఆయన భావిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని చూపిస్తానని..వారి సమస్యలు పరిష్కరించిన తర్వాతనే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఆది అంటారు. అలాగని ఆచరణ సాధ్యం కాని హామీలేవీ తాను ఇవ్వనంటారు. ఎమ్మెల్యే కాకపోయినా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజక వర్గానికి ఎంతో సాయం చేశారు. చెన్నమనేని ఎమ్మెల్యేగా ఉండగానే వేముల వాడకు ఆది శ్రీనివాస్ జూనియర్ కాలేజీని తీసుకురావడం నియోజక వర్గంలోనే సంచలనం అయ్యింది.

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది



# ఆది వస్తున్నారంటే గుండె అదురుతుంది

## ఏ కాగితం తీసి ఏం అడుగుతారోనని కంగారొస్తుంది

అనుక్షణం జనంలోనే ఉండే నేతలు ఎప్పుడూ జనం కోసమే ఆలోచిస్తారు. వారి సమస్యల పరిష్కారానికి తానేమి చేయగలననే చూస్తారు. ఏళ్ల తరబడి జనంతోనే మమేకం అవుతూ వస్తోన్న ఆది శ్రీనివాస్ గురించి ఇక చెప్పేదేముంది. ఆయన రాజకీయ ప్రస్థానం ఆరంభంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డితో సాన్నిహిత్యం ఉండేది. దాన్ని ఆయన నియోజక వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి..తమ ప్రాంత అభివృద్ధికి వాడుకున్నారు తప్ప తన సొంత పనులకోసం ఏ నాడూ వినియోగించుకోలేదు.15 ఏళ్ల తర్వాత ఆది శ్రీనివాస్ మరోసారి పాలక పక్షంలో ఉన్నారు. ఇపుడాయన ఎమ్మెల్యే. ఎమ్మెల్యే కాకుండానే గతంలో తన నియోజక వర్గం కోసం వై.ఎస్.ఆర్. ను పట్టుకుని ఎన్నో పనులు చేయించుకున్నారు ఆది. ఇపుడు తాను ఎమ్మెల్యేగా ఉన్నారు.









ఇక ఆగేదేముంది? అభివృద్ధిలో తగ్గేదేముంది? ప్రస్తుత తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కష్టపడి పనిచేసే వారన్నా..ప్రజలకోసం ఆలోచించే ఎమ్మెల్యేలన్నా బాగా ఆదరణగా చూస్తారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోన్న సమయంలో వేములవాడ నియోజక వర్గంలో ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి మేరకు రేవంత్ రెడ్డితో పాటు నలుగురు మంత్రులు , సీనియర్ నేతలు..ఉన్నతాధికారులు ప్రజాపాలన సభలో పాల్గొన్నారు. ఆ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ' ఇంతకు ముందు మీ నియోజక వర్గంలో ఉండే ఎమ్మెల్యేలను మీరు కలవాలన్నా కలవలేకపోయేవారు.



ఇపుడు మీ ఎమ్మెల్యేని మీరు కలిసే ప్రయత్నమే చేయక్కర్లేదు..ఎందుకంటే ఆయన ఎప్పుడూ మీతోనే మీలోనే ఉంటారు. మీ ఎమ్మెల్యే అంటే నాకు ఒకింత భయం అని చమత్కరించారు. ఆది శ్రీనివాస్ సచివాలయంలో నా ఛాంబర్ కు వస్తున్నారంటే నా గుండె అదురుతుంది. ఆయన చేతిలో రక రకాల కాగితాల



ఫైళ్లు ఉంటాయి. ఏ కాగితం నా చేతిలో పెట్టి ఏం నిధులు అడుగుతారోనని నాకు కంగారొస్తుంది అన్నారు. ఆది శ్రీనివాస్ లా ప్రజల కోసం ప్రభుత్వం దగ్గరకు వచ్చి పనులు అడిగేవారంటే తనకు చాలా ఇష్టమన్నారు రేవంత్ రెడ్డి. మీ ఎమ్మెల్యే ఏ నాడూ తన సొంత పనులకోసం నన్ను అడగలేదు. పైరవీలకోసం నన్ను కలవలేదు.




ట్రాన్స్ ఫర్ల కోసమో మరో కాంట్రాక్టులు ఎవరికైనా ఇప్పించాలనో అడగలేదు. ఆయన ఎప్పుడు వచ్చినా మా నియోజక వర్గానికి ఇది కావాలి దయచేసి ఇప్పించండనే అడుగుతారు. తాను ఇండిపెండెంట్ గా పోటీ చేసినా మీరు ఆయనకు అండగా ఉన్నారని గుర్తు చేసుకుని..మా ప్రజలకోసం ఏదైనా చేయండని అడుగుతారు అని రేవంత్ రెడ్డి వివరించారు. నిజంగానే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే అయిన తర్వాత సగం ప్రభుత్వాన్ని వేములవాడ నియోజక వర్గానికి తీసుకు వచ్చి వెయ్యికోట్ల రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజలు చేయించి





ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. దటీజ్ ఆది.



# పదవులు ముఖ్యం కాదు...
# ప్రజలతో ఉండడమే ముఖ్యం

**జీవితాంతం ప్రజాసేవలో ఉండగలగడమే నిజమైన భాగ్యం**

పదవులు ముఖ్యం కాదంటారు. వాటి కోసం తాను ఏనాడూ వెంటపడలేదని అన్నారు. నిజంగానే గతంలో వై.ఎస్.ఆర్. పిలిచి పదవులు ఇచ్చారు. ఇపుడు ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆది సామర్థ్యం తెలుసు కాబట్టే ప్రభుత్వ విప్ వంటి కీలక పదవిని ఇచ్చి ఆయన సేవలను ప్రభుత్వంలో సద్వినియోగం చేసుకున్నారని చెప్పక తప్పదు. ఎంతకాలం జీవించామన్నది కాదు ముఖ్యం. ప్రజలకు ఎంత చేశాం అన్నది పాయింట్. సొంత నియోజక వర్గానికి ఏం తెచ్చామన్నది ముఖ్యం అంటారు ఆది శ్రీనివాస్.







2009 నుండి ఏ పదవీ లేకపోయినా.. ప్రజలతో మమేకం అవ్వుతూ ముందుకు సాగడం వల్లనే తాను సంతోషంగా ఉండగలిగానంటారు ఆది.  పదవి ఉన్నా లేకపోయినా వేములవాడ నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇస్తున్నారు. జీవితాంతం నా నియోజక వర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేను అక్కడ వాలిపోతాను. అది చాలు నా జీవితానికి అని ఆయన భావోద్వేగంతో అన్నారు.జనం గుండెల్లో ఇంత చోటు దక్కించుకుంటే ఏ ప్రజాప్రతినిధికైనా ఇంకేం కావాలి? ఆది శ్రీనివాస్ తన రాజకీయ ప్రస్థానంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి..తన ప్రజలకు







మరిన్ని అభివృద్ధి.. సంక్షేమ పథకాలు అందించాలని ఆకాంక్షిద్దాం.

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

# వేములవాడ....

# గేమ్ ఛేంజర్



## మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

అనిల్ కుమార్ కుంట....

సందేశ్ మీడియా...

93933 44405




చరిత్ర

నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'





S tv SANDESH

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

SANDESH PLUS